ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

ఆధిక కేసుల పరిష్కారానికి

కృషిచేయాలి

● జిల్లా ప్రధాన జడ్జి యామిని



కడప రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా 13వ తేదీ శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఆధిక కేసులు రాజీ అయ్యేలా ఆయా కోర్టుల జడ్జిలు కృషిచేయాలని డీఎల్ఎస్ఏ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. మంగళవారం ప్రధాన జడ్జి తన చాంబర్‌లో ఆయా కోర్టుల జడ్జిలతో ముందస్తు లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయ సేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా లోక్ అదాలత్‌లను దేశమంతటా నిర్వహిస్తూ వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘించిన వారిపై పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలానాలను రాబోయే జాతీయ లోక్ అదాలత్ బెంచ్‌లో సెటిల్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీచేశారన్నారు. ఈ అంశాలను కక్షిదారులకు వివరించి లోక్ అదాలత్ ప్రయోజనాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

మూడు నెలల కోసం వర్గాల పోటీ

● వైసీపీలో మేయర్ పీఠముడి
● పదవికోసం మూడు వర్గాలుగా విడిపోయిన కార్పొరేటర్లు
● కోర్టులో నేడు తీర్పు
● ఎన్నికకు అనుకూలంగా న్యాయస్థానం తీర్పుఇస్తే.. రేపే ఎన్నిక

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా కడపలో రాజకీయవేడి తగ్గలేదు. స్థానిక సంస్థలకు వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. అంతకన్నా మునుపే కార్పొరేషన్ మేయరు రూపంలో మరో ఎన్నిక వచ్చింది. న్యాయస్థానంలో ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా తీర్పు వస్తే గురువారం మేయర్ ఎన్నిక జరగనుంది. దీంతో ఇప్పుడు మేయరు పీఠం వైసీపీలో కాక రేపుతోంది. మేయరు పదవి కోసం వైసీపీలో పలువురు కార్పొరేటర్లు పోటీ పడుతున్నారు. కార్పొరేటర్లు అంతా మూడు వర్గాలుగా విడిపోయారు. ఈ నేపథ్యంలో మేయరు అభ్యర్థిని ఎంపిక చేసేందుకు బుధవారం ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ మేయరు సురేశ్‌బాబు సమావేశం జరపబోతున్నారు.

మేయర్ ఎన్నిక ఎందుకంటే..

నిబంధనలకు విరుద్ధంగా కుటుంబ సభ్యులు కాంట్రాక్టు పనులు చేయడంతో సెప్టెంబరు 23న సురేశ్‌బాబును మేయరు పదవి నుంచి తొలగిస్తూ మున్సిపల్ అడినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే కడప మేయరు స్థానం బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చింది. 11వ తేదీ గురువారం ఉదయం 11గంటలకు ఎన్నిక నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఎన్నికను సవాల్ చేస్తూ మాజీ మేయరు సురేశ్‌బాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా తీర్పు వస్తే గురువారం మేయరు ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.



పలువురు పోటీ

పాలకవర్గం గడువు వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. మూడు నెలల్లో ముగియనున్న మేయరు కుర్చీ కోసం ఇప్పుడు ఎన్నిక జరగనుంది. అయినా సరే.. వైసీపీలో పలువురు కార్పొరేటర్లు పోటీ పడుతున్నారు. మేయరుగా ఇంతకాలం తానే ఉండటంతో తన వర్గీయులను ఆ పీఠంలో కూర్చోబెట్టాలని సురేశ్‌బాబు భావిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఇక పాకా సురేశ్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి వర్గాల మధ్య కూడా పోటీ ఉంది. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఇప్పుడు స్తబ్దుగా ఉన్నారు. దీంతో మాజీ మేయర్ సురేశ్‌బాబు, పాకా సురేశ్, రవీంద్రనాథరెడ్డి వర్గాల మధ్య పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ఎవరిని మేయర్‌గా ఎన్నుకోవాలనే విషయంపై బుధవారం మీటింగ్ జరగనుంది. ఎంపీ అవినాశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి ఎవరి పేరు ప్రకటిస్తారనేదానిపై అందరిలో ఆసక్తి నెలకొంది. మొత్తానికి వైసీపీలో మేయరు ఎన్నిక కాక లేపిందని చెప్పవచ్చు. కార్పొరేషన్‌లోని 50 డివిజన్లకు గాను ప్రస్తుతం వైసీపీకి 39 మంది కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో ఉండడంతో మొత్తం 40కి చేరుకుంది. అయితే ఓ కార్పొరేటరు తనకు మేయరుగా అవకాశమిస్తే ఒక్కో కార్పొరేటరుకు రూ.3లక్షలు ఇస్తామని చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. వైసీపీ ఎవరిని డిసైడ్ చేస్తుందో.. న్యాయస్థానం తీర్పు ఏమిస్తుందో వేచి చూడాల్సి ఉంది. అప్పటి వరకు అందరిలో ఉత్కంఠ తప్పదు.

కడప మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌పై.. ముగిసిన వాదనలు.. నేడు నిర్ణయం వెల్లడి

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కడప మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ మాజీ మేయర్ సురేశ్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించారు.

కడప మేయర్ ఎన్నిక నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ మేయర్ సురేశ్‌బాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మేయర్‌గా తనని తొలగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై తాను వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగా మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదన్నారు. దానిని రద్దు చేయాలని కోరారు. సురేశ్‌బాబు తరపున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపించారు. మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్ వేసిన వ్యాజ్యం పెండింగ్‌లోనే ఉందన్నారు. ఆ పిటిషన్‌ను అనుమతిస్తే న్యాయపరమైన చిక్కులు ఉత్పన్నమౌతాయన్నారు. పురపాలక చట్టనిబంధనలు ప్రకారం సభ్యుల కాలపరిమితి ముగియడానికి ఆరునెలల ముందు ఎన్నిక నిర్వహించడానికి వీల్లేదన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరపున న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ వాదనలు వినిపిస్తూ.. సభ్యుడి కాలపరిమితి ముగియడానికి 6నెలల ముందు ఎన్నిక నిర్వహించకూడదన్న నిబంధన మేయర్ ఎన్నికకు వర్తించదని వివరించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి బుధవారం నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించారు.

కొండాపురం వాసికి అరుదైన గౌరవం

● హిందీ సలహామండలి సభ్యుడిగా గైబువల్లి



కొండాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొండాపురం గ్రామానికి చెందిన షేక్ గైబువల్లికి అరుదైన గౌరవం దక్కింది. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకు అనుబంధంగా కేంద్ర మంత్రి అమిత్‌షా అధ్యక్షతన ఏర్పాటైన హిందీ సలహామండలికి సభ్యుడిగా ఈయనను నియమించారు. మొత్తం దేశవ్యాప్తంగా 26 మందిని సభ్యులుగా నియమించగా.. వీరిలో గైబువల్లి ఒకరు. ఈ 26 మందిలో పలువురు రాజ్యసభ సభ్యులు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులు ఉన్నారు. వీరందరూ మూడేళ్లపాటు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని గైబువల్లి తెలిపారు. ఈయన ప్రస్తుతం హిందీ ప్రచారసభ(హైదరాబాద్) ప్రధాన కార్యదర్శిగా, హిందీ సేవాసదన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 18 ఏళ్ల వయసు నుంచి తెలుగు రాష్ట్రాల్లో హిందీ భాషాభివృద్ధికి విశేషంగా కృషిచేసినట్లు తెలిపారు. హిందీ భాష సమస్యలపై ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేశానన్నారు. హిందీ భాషపై తనకున్న నిబద్ధతను గుర్తించి కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకు హిందీ సలహామండలి సభ్యుడిగా తనను నియమించారన్నారు.

నెలాఖరులోగా స్మార్ట్ కిచెన్ షెడ్స్ పూర్తి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్‌ను జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో జేసీ అదితిసింగ్‌తో కలసి సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేశామన్నారు. స్మార్ట్‌కిచెన్‌ల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం విద్యార్థులకు రుచిగా, శుచిగా తాజాగా అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్లు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో నూతనంగా మరో 33 స్మార్ట్ కిచెన్ షెడ్లను నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్మార్ట్ కిచెన్లలో ఏర్పాటు చేసే పరికరాల కోసం టెండర్, కొనుగోలు, ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సరఫరాకు వాహనాలు తదితరాలపై కలెక్టర్ సమీక్షించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు తింటున్నారా? అందులో నాణ్యత విషయమై వారి తల్లిదండ్రుల నుంచి ర్యాండంగా అభిప్రాయాలు సేకరించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు స్మార్ట్ ఫార్మింగ్ ఏర్పాటుకు సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, డీఆర్డీయే పీడీ రాజ్యలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ ప్రేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్


● కేంద్రాలు ఎనిమిది
● అభ్యర్థులు 15,062 మంది

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2025) బుధవారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లాలో 15,062 మంది అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణ కోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజు రెండు సెషన్లలో ఉదయం 9.30 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. కడప, ప్రొద్దుటూరుల్లో ఎనిమిది ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్‌కు తప్పనిసరిగా మూడేళ్లలో ఉత్తీర్ణత సాధించాల్సిందేనని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. 2009 డీఎస్సీకి ముందు ఉపాధ్యాయులుగా విధుల్లో చేరినవారు ఉన్నారు. వీరిలో కేవలం 10 శాతం మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి కొంతమంది సర్వీసు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఇంకొంతమంది న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానం అనుకూలంగా స్పందిస్తుందనే ఆశతో ఉన్నారు. ఇటీవల మెగా డీఎస్సీలో టెట్‌లో తక్కువ మార్కులు వచ్చి ఎందరో అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు దూరమయ్యారు. అటువంటి వారితో పాటు ఇటీవల రిలీవైన బీఈడీ, డైట్ విద్యార్థులు కూడా టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కాగా.. అభ్యర్థుల సౌలభ్యం కోసం ఉదయం 7గంట ల నుంచి సాయంత్రం 7గంటల వరకు హెల్ప్‌డెస్క్ నెంబర్లను జిల్లా శాఖ అందుబాటులో ఉంచింది. ఏవైనా సందేహాలుంటే 9959322209, 9948121966, 9849 900614 నెంబర్లలో సంప్రదించాలని సూచించింది.

కళాశాల విద్య ఆర్జేడీగా రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కడప కళాశాల విద్య ఆర్జేడీగా డాక్టర్ జి.రవీంద్రనాథ్‌ను నియమిస్తూ కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ కృష్ణ చప్పిడి ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటి వరకు ఆర్జేడీగా వ్యవహరిస్తున్న డాక్టర్ డి.నాగలింగారెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో కడప గవర్నమెంట్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో ఆర్జేడీగా నియమించారు. తమ సాధారణ విధులతో పాటు ఆర్జేడీ బాధ్యతలను కూడా ఈయన నిర్వహించాల్సి ఉంటుంది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ అదనపు బాధ్యతలు కొనసాగుతాయి.

అంగరంగ వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



బద్వేలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో మంగళవారం సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలుగుగంగ కాలనీలో సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమైన అయ్యప్పస్వామి గ్రామోత్సవం పట్టణంలోని వీధుల గుండా భక్తిశ్రద్ధలతో సాగింది. గ్రామోత్సవం వెంట శ్రీకృష్ణ కోలాటం, చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి నామస్మరణతో బద్వేలు పట్టణమంతా మార్మోగింది.

గోల్‌షాట్ బాల్ ఇండియా జట్టుకు తేజేంద్ర



వేంపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో గోల్‌షాట్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు వేంపల్లెకు చెందిన రాచవీటి తేజేంద్ర ఇండియా జట్టుకు ఎంపికయ్యారు. వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన నవంబరులో పంజాబ్‌లో జరిగిన గోల్‌షాట్ బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి ఇండియా జట్టులో స్థానం పొందారు. ఈ నెల 5 నుంచి హర్యానాలో జరుగుతున్న ప్రాక్టీస్ పోటీల్లో పాల్గొంటున్నారు. 16 నుంచి 19వ తేదీ వరకు సౌత్ ఏషియన్ అంతర్జాతీయ గోల్‌షాట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నేపాల్‌లోని ఖాట్మండులో జరగనున్నాయి. ఈ పోటీల్లో ఇండియా జట్టు తరుపున తేజేంద్ర ఆడనున్నారు. వేంపల్లె ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ఇండియా జట్టుకు ఎంపికైన తేజేంద్రను అభినందించారు.

పది పదుల ప్రణాళిక

● ఉత్తమ ఫలితాల సాధనకోసం విద్యాశాఖ కసరత్తు
● ఏ బీ సీ డీ గ్రేడులుగా విద్యార్థుల విభజన
● చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పదోతరగతి తొలిమెట్టు. ఇందులో ప్రతిభ చూపాలని ప్రతి విద్యార్థి ఆశిస్తుంటాడు. ఆ మేరకు విద్యార్థులను ర్పిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించింది. కార్యాచరణ సిద్ధం చేసి మారిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకొని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటుతో తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. పరీక్షల షెడ్యూల్ కూడా విడుదల కావడంతో ఈనెల 6వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు 100 రోజుల ప్రణాళికను అమలుచేస్తున్నారు. తమ భవిష్యత్తుకు కీలకమైన పదోతరగతి పరీక్షలను ఓ సమరంలా భావించి విద్యార్థులు సన్నద్ధమవుతుండగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ప్రాధాన్యమిస్తూ వారిని సంసిద్ధులను చేస్తున్నారు.

పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 16వ తేదీ నుంచి ప్రధాన పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మూడు నెలల వ్యవధిలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వందరోజుల ప్రణాళికలను అనుసరిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది రెగ్యులర్ 27,638 మంది, ప్రైవేట్ 367 మంది మొత్తం 28,005 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ కృషిచేస్తోంది. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రోజుకో సబ్జెక్టు పునఃశ్చరణ పరీక్షలు రాయిస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్ది విద్యార్థుల లోపాలను మెరుగుపరుస్తున్నారు. చదువులో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు.

పాఠ్యాంశాల మార్పుతో..

పదో తరగతి పాఠ్యాంశాలు 2024-25 విద్యా సంవత్సరం నుంచి, హిందీ పాఠ్యాంశం 2025-26 నుంచి పూర్తిగా మారాయి. పరాక్, ఎన్‌సీఈఆర్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా బోధన-మూల్యాంకన విధానంలో జరిగిన మార్పుల వలన కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం నెలకొన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు వంద రోజుల ప్రణాళికను విద్యాశాఖ రూపొందించింది.

విద్యార్థుల విభజన

విద్యార్థుల స్థాయిని బట్టి సీ, డీ గ్రేడ్ విద్యార్థులను రైజింగ్ స్టార్స్‌గా.. ఏ, బీ గ్రేడ్ విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా విభజించి ప్రత్యేక బోధన, రీమిడియల్ క్లాసులు, అదనపు సాధన చేయించేలా ప్రణాళిక రూపొందించారు. లెవెల్-1 ప్రశ్నలు అన్నీ విద్యార్థులు తప్పనిసరిగా నేర్చుకోవాలి, లెవెల్-2ను ప్రధానంగా ప్రతిభావంతులు అభ్యసించాలని సూచించారు.

రోజువారీ స్లిప్ టెస్టులు

ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు స్లిప్ టెస్టులు, ఉదయం 8-9 గంటలకు సమాధానాల విశ్లేషణ, రీమిడియల్ బోధన నిర్వహించాలని సూచించారు. మార్కులను లీప్ యాప్‌లో నమోదు చేయడం తప్పనిసరి చేశారు.

స్టడీ మెటీరియల్ లీప్‌యాప్‌లో

డీజీఈ, ఏపీ మూడు మోడల్ పేపర్లు, లెవెల్ వైజ్ ప్రశ్నాబ్యాంక్, స్టడీ మెటీరియల్‌ను లీప్ యాప్‌లో అందుబాటులో ఉంచింది. బీఎస్ఈ వెబ్‌సైట్‌లో ఉన్న అదనపు మోడల్ పేపర్లను కూడా తప్పనిసరిగా సాధన చేయించేలా సూచించారు. ఆదివారాలు, రెండో శనివారాల్లో క్లాసులు నిర్వహించే సందర్భంలో అమ్మాయిల భద్రత, మిడ్డే మీల్ ఏర్పాటు, విద్యార్థుల రవాణా వంటి అంశాల్లో పాఠశాలలు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా, మండల శిక్షణ అకడమిక్ బృందాలు ఈ కార్యాచరణ ప్రణాళికను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, సరైన రికార్డులతో ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీ చేశారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్ తప్పనిసరి



ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఈనెల 6వ తేదీ నుంచి వంద రోజుల యాక్షన్‌ప్లాన్ అమలు చేస్తున్నాం. నిర్ణయించిన టైంటేబుల్ ప్రకారం సబ్జెక్టులపై అవగాహన కల్పించేలా ఆదేశాలిచ్చాం. సబ్జెక్టు నిపుణులు తయారు చేసిన ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొని నిత్యం విద్యార్థులతో రాయిస్తున్నాం. ఈ ఏడాది రెండు రకాలుగా వందరోజుల ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నాం. ఏ, బీ గ్రూప్ విద్యార్థుల కోసం షైనింగ్ స్టార్స్ ప్రోగ్రాం, సీ, డీ గ్రేడ్ల విద్యార్థులకు రైజింగ్ స్టార్స్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాం. అంతర్గత మార్కుల వివరాలు తల్లిదండ్రులతో చర్చించి ప్రోగ్రెస్ కార్డులను అందించి ఇంటి వద్ద విద్యార్థులు ఎలా సన్నద్ధం కావాలన్న విషయాలపై దిశానిర్దేశం చేస్తున్నాం.

- డాక్టర్ ఎస్.షంషుద్దీన్,
జిల్లా విద్యాశాఖాధికారి

అభివృద్ధి పేరుతో.. అవస్థలు..!

● గాడి తవ్వి వదిలేశారు
● రాకపోకలకు ప్రజల ఇబ్బందులు


మెయిన్‌బజార్, పాతపేట ప్రాంతంలో రోడ్డు మధ్యలో గాడితవ్విన దృశ్యం

వేంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో అభివృద్ధి పేరిట చేస్తున్న పనులతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రణాళికాబద్ధంగా పనులు చేయక పోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాటర్‌గ్రిడ్ పనుల్లో భాగంగా తాగునీటిని సరఫరా చేసేందుకు పైప్‌లైన్ ఏర్పాటుకు వేంపల్లె పట్టణంలోని గాంధీరోడ్డు నుంచి పప్పుల బజారు, బొడ్డుచావిడి, అమ్మవారిశాల మీదుగా మెయిన్ బజార్, పాతపేట వరకు సిమెంటు రోడ్డును కట్ చేసి గాడులు పెట్టారు. సుమారు నెలరోజుల క్రితం ఈ పనులు చేశారు. పైప్‌లైన్ ఏర్పాటుచేసి త్వరగా గాడులను పూడ్చి యథావిధిగా సిమెంటు రోడ్డు వేస్తామని కాంట్రాక్టర్లు చెప్పుకొచ్చారు. ఇదే విషయాన్ని స్థానిక ఈఓ నాగభూషణంరెడ్డి ప్రజలకు చెప్పారు. కానీ గాంధీరోడ్డు నుంచి కొంతమేర మాత్రమే పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. మిగిలిన ప్రాంతాల్లో పనులు ఇప్పటికీ చేయనేలేదు. గాడులు తవ్వి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డు మధ్యలో గాడులు వేయడంతో ఆ ప్రాంతంలో స్కూల్ బస్సులు వెళ్లే సమయంలో చాలా ఇబ్బందికరంగా మారింది. కొంత వరకే గాడులు తవ్వి అక్కడ పనులు పూర్తయిన తర్వాతే మిగిలినచోట మళ్లీ మొదలుపెడితే బాగుంటుందని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి రోడ్డు మధ్యలో ఉన్న గాడులను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేస్తారు

మెగా కంపెనీ ద్వారా వాటర్‌గ్రిడ్ పనులు జరుగుతున్నాయి. 300 మీటర్లు మాత్రమే గాడి తవ్వి అక్కడ పనులు పూర్తయ్యే వరకు మిగతా పనులు చేయద్దని కాంట్రాక్టర్‌కు చెప్పాం. ప్రస్తుతం గాడులు తీసిన ప్రాంతాల్లో పనులు త్వరగా పూర్తి చేస్తారు.

- నాగభూషణంరెడ్డి, ఈఓ వేంపల్లె

ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 ఔషధ నియంత్రణ తనిఖీ కేంద్రాలు, 2 ల్యాబ్‌లను ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ నాణ్యత, ఎక్స్‌పైరీ తేదీలను తప్పక పరిశీలించాలన్నారు. ఆస్పత్రిలో అధికారులు ల్యాబ్‌లను, మందులు దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. త్వరలో జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు వైద్య సేవలను సక్రమంగా అందించి రెఫర్ తగ్గించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ మెడికల్ సూపరింటెండెంట్ కవిత, డ్రగ్స్ నియంత్రణ కేంద్రం అదనపు డైరెక్టర్ షేక్ ఆశ, మదనపల్లె, అనంతపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కలంధర్, కేశవరెడ్డి, మదనపల్లె మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి భూషణ్‌గుప్తా, మదనపల్లె కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి బాలాజీ, మదనపల్లె నేతలు మాలతి, మురళి, సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనులకు ప్రాధాన్యం : పీడీ



మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

కురబలకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం వ్యవసాయరంగానికి దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. మంగళవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు లాభసాటి వ్యవసాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల షెడ్‌లు, పశుగ్రాసం, పండ్లతోటల పెంపకం మెటీరియల్స్ బిల్లులను వారం రోజుల్లోగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగయ్య, ఏపీడీ నందకుమార్, ఏపీవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టండి

తంబళ్లపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో రైతులకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టాలని ఉపాధి పీడీ వెంకటరత్నం సూచించారు. మంగళవారం ఏపీడీ నందకుమార్‌రెడ్డితో కలసి తంబళ్లపల్లె మండలంలో పర్యటించారు. తొలుత కన్నెమడుగు సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాహూజీ పట్నాయక్, ఏపీవో అంజనప్పతో కలసి ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. గతంలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయకపోడంపై సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో థామస్‌రాజు, డిప్యూటీ ఎంపీడీవోలు ప్రసాద్, మారుతీకుమార్, ఈసీ మహేశ్, టీఏలు సుజాత, పుష్పకుమారి ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముదివేడులో 'బంగారం' సినీసందడి



పూజలు చేస్తున్న సినిమాలోని నటీనటులు

కురబలకోట, డిసెంబరు 9((ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో 'బంగారం' సినీసందడి నెలకొంది. మంగళవారం మండలంలోని ముదివేడులో వెలసిన దండుమారెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి షూటింగ్‌ను ప్రారంభించారు. కుషి ఫిలిమ్స్ బ్యానర్‌పై చిత్రాన్ని నిర్మించనున్నట్లు ప్రొడ్యూసర్లు పి.రమేష్, కె.రాజేష్‌రెడ్డి, గాయత్రమ్మ అంజనప్ప పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని మదనపల్లె పరిసర ప్రాంతాల్లో 3 నెలల పాటు చిత్రీకరించి పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి నుంచి నిర్విరామంగా జరిపి జూన్ నెలాఖరులో విడుదలకు సన్నాహాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రం ప్రేమ, ఫ్యాక్షన్, ఎమోషనల్‌తో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రానికి హీరోగా ఘట్టమనేని కుటుంబానికి చెందిన శరణ్‌కుమార్, హీరోయిన్‌గా సంకీర్తన, దర్శకుడు సుధాకర్ అని తెలిపారు.

యూత్ ఫెస్టివల్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్త

వేంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హిందుస్థాన్ యూనివర్సిటీలో కలైకూడం-2025 సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌కు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. నూజివీడులో నవంబరు 8వ తేదీ జరిగిన 39వ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ కల్చరల్ పోటీల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి చెందిన విద్యార్థులు కూచిపూడి, జానపద బృంద నాట్యం, ఇండియన్ బృంద గానం, క్రియేటివిటీ కొరియోగ్రఫీ, వెస్ట్రన్ ఇన్‌స్ట్రుమెంట్ డిబేట్ పోటీల్లో 32 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారని ట్రిపుల్‌ఐటీ ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి మొయినుద్దీన్‌ఖాన్ తెలిపారు. ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

పొలం పనుల్లో బిజీ..బిజీగా...



గొబ్బూరివారిపల్లెలో తెల్లవారగానే పంట పొలాల్లో రైతు కూలీలు

రాజంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడ్డాయి.. అన్నదాత పొలం పనుల్లో బిజీ అయ్యాడు. తమకున్న అరకొర పొలాల్లో వరి, వేరుశనగ, పసుపు తదితర పంటలను సాగు చేయడానికి సిద్ధమయ్యాడు. ఇటీవల కురిసిన ఒక మోస్తరు వర్షాలు, నదుల్లో నీరు రావడం, చెరువులో నీరు చేరడం, భూగర్భజలాలు పెరగడం వల్ల రాజంపేట డివిజన్‌లో ఏ గ్రామంలో చూసినా రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఇంటిల్లిపాది పంట పొలాలవైపు కదులుతున్నారు. కూలీలను వెంటేసుకుని పొలాలకు వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం చలికాలం అయినా వేకువజామునే లేచి భుజంపై పలుగు పారా పట్టుకుని ఉదయించే సూర్యుడి తొలిపొద్దులో చలిని కాచుకుంటూ అదో గమ్మత్తైన వాతావరణంలో వ్యవసాయ పనులు చేసుకొంటున్నారు.



గొబ్బూరివారిపల్లెలో మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం



గట్టుమీదపల్లెలో ఉదయమే పనిచేసి గట్లపై భోజనాలు చేస్తున్న రైతులు



వరి నాట్లలో మహిళలు



చిట్వేలి మండలం నగరిపాడులో దుక్కులు దున్నుతున్న రైతు

పిల్లల ఆరోగ్యంలో ఐసీడీఎస్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల పోషణ, ఎదుగుల ఆరోగ్య ఫలితాలను మెరుగుపర్చడానికి ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సీడీపీవో, సూపర్‌వైజర్లను కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలసంజీవని టీహెచ్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్, గ్రోత్ రిపోర్టు పోషన్ ట్రాకర్, పీఈఎస్ హాజరు, బీటీ కిట్, తదితర అంశాలపై సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో ఎక్కువ శాతం విద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ శాతం బడ్జెట్ కేటాయిస్తోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందజేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

కార్పొరేట్‌కు దోచిపెడుతున్న ప్రభుత్వాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

రైల్వేకోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. మంగళవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల కారణంగా దేశం నాశనం అవుతోందని, అందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని ఆరోపించారు.

రాష్ట్రంలో కొత్త జిల్లాల ఎంపిక శాస్త్రీయ పద్ధతిలో లేదన్నారు. రవాణా సౌకర్యం, వనరులు, అభివృద్ధి తదితర అంశాలతో పాటు ప్రజల ఆమోదంతో నూతన జిల్లాలు ఎంపిక చేయాలన్నారు. ఇందులో కూడా మెజార్టీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా ఎంపిక ప్రక్రియ గత ప్రభుత్వంలోను, ప్రస్తుత ప్రభుత్వం లోను సక్రమంగా జరగలేదంటూ ఆందోళన మొదలైందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించి వ్యాపారులకు అండగా నిలిచిందన్నారు. భారత రాజ్యాంగం నుంచి లౌకికవాదం, ప్రజాస్వామ్యంను తొలగించడానికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు బిల్లును ప్రవేశపెడుతోందని ఆరోపించారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడిస్తే దేశానికి తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాలు, కులాలను రెచ్చగొట్టే పార్టీలు మనుగడ సాధించలేవన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, రైల్వేకోడూరు పార్టీ అధ్యక్షుడు జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, విద్యార్థి నాయకుడు తుమ్మల చైతన్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడుమూరులో ఘనంగా వాటర్‌షెడ్ మహోత్సవ్



జలహారతి ఇస్తున్న వాటర్‌షెడ్ అధికారులు, రైతులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జల్‌శక్తి ఆధ్వర్యంలో వాటర్‌షెడ్ నిర్మాణ పనులను తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం, మొలకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో వివిధ రకాల పనులను చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం మడుమూరులో ఆరు మండలాలకు చెందిన వాటర్ షెడ్ సిబ్బంది, రైతులతో కలిసి వాటర్‌షెడ్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పీవో ఖాజామొయినుద్దీన్ ఆధ్వర్యంలో మడుమూరు సచివాలయం వద్ద నిర్వహించారు. ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ వాటర్ షెడ్ నిర్మాణ పనులను చేపట్టడం ద్వారా నీటి నిల్వలు సమృద్ధిగా ఉంటున్నాయని, సంపతికోట ప్రాజెక్ట్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలంలో ఆరు గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. మడుమూరు గ్రామంలో చేపట్టిన పెద్ద ఊటకుంటలు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. దీంతో ఆ ఊటకుంటలకు జలహారతి సమర్పించి జాతికి అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ సిబ్బంది, మడుమూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రవీంద్రబాబు, నవీన్, గురుమూర్తి, రాహూరివాండ్లపల్లె వెంకట్రమణ రాజు, రాజారెడ్డి, శెట్టిపల్లె కిట్టన్న, లక్ష్మీనారాయణ పలువురు రైతులు పాల్గొన్నారు.

కురవంక సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

మదనపల్లె టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కురవంక సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీవో రాధమ్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కురవంక పంచాయతీకి సంబంధించి చెత్త తరలించే వాహనాలు, ఇతర ఖర్చుల విషయమై సక్రమమైన బిల్లులు, ఓచర్లు సమర్పించకపోవడంతో సర్పంచ్ చలపతికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారని, దీనికి సర్పంచ్ నుంచి 10 రోజుల గడువు ఇచ్చినా బిల్లులు, ఓచర్లు సమర్పించలేదన్నారు. దీంతో ఈనెల 9వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తునట్లు డీపీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశ్యంతోనే తమకు పంచాయతీ రికార్డులు అప్పగించకుండా చేయడంతో పాటు, ఇదే కారణం చూపిస్తూ కొందరు తన చెక్‌పవర్‌ను రద్దు చేయించారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

క్రమబద్ధీకరించుకోకుంటే రిజిస్ట్రేషన్లు ఆపేస్తాం

- పీకేఎం ఉడా చైర్మన్ సురేశ్‌బాబు



మాట్లాడుతున్న పీకేఎం ఉడా చైర్మన్

మదనపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్లాన్ లేకుండా నిర్మించిన భవనాలు, అనుమతికి మించి ఎక్కువగా నిర్మించిన, డీవియేషన్ అయిన నిర్మాణాలను (బీపీఎస్) క్రమబద్ధీకరించుకోవాలని పీకేఎం ఉడా చైర్మన్ బి.ఆర్.సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పీకేఎం ఉడా కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ అప్రూవల్ లేకుండా వేసిన లేఅవుట్లను కూడా క్రమబద్ధీకరించుకోవాలని ఇందుకోసం ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. లబ్ధిదారులు సకాలంలో దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ తరహాలో ప్రభుత్వం ప్రజలకు మంచి అవకాశం కల్పించిందన్నారు. ఇలాంటి పథకాలు మళ్లీ మళ్లీ రావని, ఇదే చివరి అవకాశం కావచ్చని తెలిపారు. ఎల్ఆర్ఎస్ పథకానికి ఇప్పటికే గడువు ముగిసినా ప్రభుత్వం మళ్లీ మూడు నెలలు పొడిగించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటికీ వినియోగించుకోకుంటే అనధికార లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు ఆపేస్తామన్నారు. ఆయా లేఅవుట్‌కు సంబంధించి మున్సిపాలిటీలో కమిషనర్, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల నుంచి లేఅవుట్ సర్వేనంబర్లు తీసుకుని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఆపేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆ లేవుట్‌లలో ప్లాట్లు కొనొద్దు..అమ్మొద్దంటూ బోర్డులు కూడా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సమావేశంలో టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టీడీపీ సీనియర్ నేత కోపూరి మల్లికార్జుననాయుడు, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఉడా కార్యదర్శి పి.ఆర్.మనోహర్, ప్లానింగ్ అధికారి సంధ్యారాణి, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వం, టీడీపీ నాయకులు ఆర్.నీలకంఠ, ఆర్.సోమశేఖర్, పూల మురళి, తదితరులు పాల్గొన్నారు.

గురి చూసి కొట్టాలి...

- పోలీసులకు ఫైరింగ్ ప్రాక్టీస్



ఫైరింగ్ ప్రాక్టీస్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ రామకృష్ణ

రాయచోటిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరుల భద్రత కోసం నిత్యం పనిచేసే పోలీసు శాఖ తన సిబ్బందిని అత్యంత పదునుగా ఉంచేందుకు వార్షిక ఫైరింగ్ ప్రాక్టీసును ప్రారంభించింది. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు మంగళవారం సివిల్ పోలీసు అధికారులదరికీ తుపాకీ వాడకంలో మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా కడపలోని జేఎంజే కళాశాల సమీపంలోని రాజీవ్ స్మృతి వనం వద్ద ఉన్న పోలీసు ఫైరింగ్ రేంజ్‌లో ఈ శిక్షణ జరిగింది. ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ దగ్గరుండి ఫైరింగ్ ప్రాక్టీస్ శిక్షణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తప్పక నిర్వహించే ఈ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో గానీ, ఆత్మరక్షణకు, ప్రజల రక్షణ మనం తీసుకునే చర్యలను వివరించారు. శిక్షణలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తమ తుపాకీ వాడకంపై ఉన్న చిన్నపాటి అనుమానాలను కూడా నివృత్తి చేసుకుని గురిని మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అనంతరం ఆర్ఎస్ఐలు శ్రీనివాసులు, అమర్‌నాథరెడ్డిలు తుపాకీ ని ఎలా పట్టుకోవాలి, ఎప్పుడు కాల్చాలి అనే విషయాలపై సిబ్బందికి వివరంగా నేర్పించారు. ప్రాక్టీస్‌లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



వరి కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాధికారులు

గాలివీడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని నూలివీడులో నిర్వహించిన వరి పంట కోత ప్రయోగం, పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలను అందించే విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని, రైతులు తమ పంటను కనీసం మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదని తెలియజేశారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు అదనపు సౌకర్యాలు కల్పిస్తుందని, ఉచిత గోనె సంచులు సరఫరా, లేబర్ చార్జీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు...



ఆనంద (ఫైల్)

పీలేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన అదృశ్యమైన ఓ వ్యక్తి శవమై తేలిన సంఘటన మంగళవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పోలీసుల కథనం మేరకు పీలేరు పట్టణం కోటపల్లెకు చెందిన బి.ఆనంద (40) ఈనెల 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. ఆరోజు, మరుసటి రోజు అతని కోసం వెతికిన అతడి భార్య బి.రాధ, అతను కనిపించడం లేదని ఈనెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తిరుపతి మార్గంలోని జీవన్ చెరువులో ఓ శవం తేలియాడుతూ కన్పించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ శవాన్ని గమనించిన పోలీసులు, కుటుంబసభ్యులు, స్థానికులు అది ఆనంద్ శవంగా నిర్ధారించారు. పోలీసులు ఆనంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని మృతికి గల కారణాలను విచారిస్తున్నారు.

కడప-రేణిగుంట రోడ్డు పనులు ప్రారంభం

- భూమిపూజ చేసిన నేతలు
- శరవేగంగా రోడ్డు మరమ్మతు పనులు



నితిన్‌గడ్కరీ, పురందేశ్వరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాజంపేట/పుల్లంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ఊరిస్తున్న కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. రోడ్డు పునరుద్ధరణ పనులకు మంగళవారం రాజంపేట బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి కలసి పుల్లంపేట సమీపంలోని ఆంజనేయస్వామి పుట్ట వద్ద భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా కడప-రేణిగుంట ఎన్‌హెచ్-716 రహదారి విస్తరణ అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. దీంతో ప్రమాదాలు కూడా ఎక్కువయ్యాయని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి రూ.100 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ముఖ్యంగా ఈ రోడ్డు విస్తరణకు ఎంపీ పురందేశ్వరి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీ, పురందేశ్వరి చిత్రపటాలకు కూటమి నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, దాసరి వాణి, రాజు, మండల బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇటీవలే కోడూరు నుంచి తిరుపతి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ సమయంలో ఈ నిధులు రావడంతో యుద్ధప్రాతిపదికన డబల్‌లైను రోడ్డును పునరుద్ధరిస్తున్నారు. భారీ యంత్రాలను ఏర్పాటు చేసి సంబంధిత కాంట్రాక్టర్ల ద్వారా రేణిగుంట నుంచి రాజంపేట వరకు రోడ్డు పనులను శరవేగంగా ప్రారంభించారు. దెబ్బతిన్న చోట్ల తారురోడ్డు వేస్తున్నారు. నెలరోజుల్లోపు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయనున్నారు. మిగిలిన చోట్ల రోడ్డును వెడల్పు చేస్తారు. దీనివల్ల కడప-తిరుపతి వాసులకే కాకుండా చెన్నై, ఇటు ముంబాయి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బళ్లారి, మహారాష్ట్ర ప్రయాణికులకు ప్రయాణం సులభతరవుతుంది. ప్రధానంగా తిరుమలకు, చెన్నైకి వెళ్లే దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతో ఉపకరిస్తుంది.


ప్రార్థనకు ముందే పాఠశాలలో ఉండాలి



టీచర్లతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల ప్రార్థన సమయానికి ముందే పాఠశాలలో ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ ఆదేశించారు. మంగళవారం కడప నగరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీ, నగర పాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాల, నగర పాలక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయపాలన లేని ఉపాధ్యాయులకు షోకాజ్ అందజేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. ఎస్ఎస్‌సీ 100 రోజుల యాక్షన్‌ప్లాన్ జిల్లాలోని ప్రతి పాఠశాల తప్పనిసరిగా అమలు కావాలన్నారు. ప్రతి పాఠశాలలో డ్రాపౌట్స్, లాంగ్ ఆబ్సెంటీస్ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, విజయలక్ష్మి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మునీర, సీఆర్ఎంటీ శంకర్, కృష్ణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించిన హంపీ పీఠాధిపతి



దువ్వూరులో అమ్మవారి ఆలయంలో విరూపాక్ష విద్యారణ్యస్వామి

దువ్వూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని మంగళవారం హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి సందర్శించారు. ఆయన రాక సందర్భంగా ఆర్యవైశ్యులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. నేరుగా ఆయన ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి స్వయంగా హారతి ఇచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయంలో కొంతసేపు సేద తీరారు. ఈ సందర్భంగా పీఠాపతిని చూసేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయాలను సందర్శన చేస్తూ ఆయన ఇక్కడికి వచ్చినట్లు స్థానిక అర్చకుడు మూర్తిస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు లింగం పట్టాబి, అధ్యక్షుడు ఆరవేటి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు యాదాల రామకృష్ణ, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లో పనులను అడ్డుకున్న అధికారులు





వివాదాస్పద భూముల్లో మట్టి తోలుతున్న దృశ్యం, అడ్డుకున్న పోలీసు, రెవెన్యూ సిబ్బంది

కాశినాయన డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మూలపల్లె సర్వేనెంబర్ 1లోని భూములు వివాదస్పదంగా మారాయి. రెవెన్యూ అధికారులు అనుమతి లేకుండా యంత్రాల సాయంతో గంగనపల్లె గ్రామానికి చెందిన కొందరు చెట్లు పీకడం, భూములు చదును చేయడం, మట్టి తోలడం వంటి పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న నర్సాపురం గ్రామస్థులు మంగళవారం ఈభూములు మావంటూ యంత్రాలతో చెట్లు తొలగించే ప్రయత్నం చేశారు. వీరిని గంగనపల్లెకు చెందిన వారు అడ్డుకున్నారు. దీంతో వీరి మధ్య ఘర్షణకు దారి తీసింది. నర్సాపురం వాసులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పనులను నిలుపుదల చేయించారు. ఈవిషయంపై డిప్యూటీ తహశీల్దారు రవిశంకర్‌ను వివరణ కోరగా... ఇరు గ్రామాల వారి వద్ద ఉన్న ఆధారాలతో కార్యాలయానికి రావాలని తెలిజేశామన్నారు.

స్థలం వివాదంతో వ్యక్తి మృతి

ఖాజీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థలం వివాదంతో పురుగులమందు తాగి పోటుగంటి హుస్సేన్ (80) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన హుస్సేన్ గత కొన్ని సంవత్సరాలుగా దుంపలగట్టులో నివాసం ఉంటున్నారు. ఆయన స్థలాన్ని అదే గ్రామానికిచెందిన మరో వ్యక్తి ఆక్రమించడంతో పలు మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి పురుగులమందు తాగి తలుపులు వేసుకున్నాడు. ఉదయం తలుపు తీయకపోవడంతో భార్య గమనించి చుట్టుపక్కలవారిని పిలువడంతో అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి, మృతుడి కుమారుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

కాగా, స్థలం వివాదం విషయం తమ దృష్టికి రాలేదని, తెలిసిన వెంటనే అక్కడ జరుగుతున్న పనులను ఆపివేశామని తహసీల్దారు రమణమ్మ తెలిపారు. కాగితాలు తీసుకురావాలని చెప్పడం జరిగిందని తహసీల్దారు రమణమ్మ అన్నారు. ఎక్కడైనా భూ సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఇతను రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆసుపత్రి ఔట్ పోస్టు హెడ్‌కానిస్టేబుల్ షబ్బీర్ తెలిపారు. ఆసుపత్రి రికార్డుల్లో అతని పేరు రవి (40), తండ్రి పుల్లయ్య, రామేశ్వరం అని వివరాలు ఉన్నాయన్నారు. శవాన్ని మార్చురీలో ఉంచారని, అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే మృతదేహాన్ని గుర్తించి తీసుకెళ్లాలని కోరారు.

కోర్టు భవనానికి రూ.9.20 కోట్లు మంజూరు

కలికిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవన నిర్మాణాలకు రూ.9.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అమల్లో వున్న నిర్మాణ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా హైకోర్టు రిజిస్ట్రారు (పరిపాలన)ను కోరుతూ న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం పాలనాపరమైన మంజూరు ఉత్తర్వులను జారీ చేశారు. ఆర్థిక శాఖ అనుమతులు కూడా పొందినట్లు అందులో పేర్కొన్నారు.

బైకుల చోరీకి పాల్పడే ముగ్గురు అరెస్టు

- అరెస్టయిన వారిలో ఒకరు మైనరు
- 18 బైకులు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ నచికేత్



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో పార్కింగ్ చేసిన బైకులను చోరీ చేసే ముగ్గురు వ్యక్తులను కడప వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, సీఐ చిన్నపెద్దన్న, ఎస్ఐ అమర్‌నాథరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ గౌస్ బాషా, షేక్ మహబూబ్ బాషా, వేల్పుల రవీంద్ర ఆలియాస్ మహేంద్రలు మరో బాలుడుతో కలిసి వన్ టౌన్ పరిధిలో 11, తాలుకా పోలీసుస్టేషను పరిధిలో 2, సీకేదిన్నె, కడప రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహ నాలను చోరీలకు పాల్పడేవారని తెలిపారు. వీరిపై వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో నిఘా పెట్టామన్నారు. ఈ నేపథ్యంలో దొంగతనం చేసిన బండ్లను వేరే ప్రాంతాలకు తీసు కుపోతున్నట్లు సమాచారం రావడంతో మోచంపేట సర్కిల్ వద్ద దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారన్నారు. ప్రధాన నిందితుడు వేల్పుల రవీంద్ర ఆలియాస్ మహేంద్ర పరారీలో ఉన్నాడని.. అతని కోసం ప్రత్యేక బృందం గాలింపు చర్య లు చేపట్టిందన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.10లక్షలు విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన 18 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసిన ప్రాంతంలో సీసీ కెమె రాల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన సీఐ చిన్న పెద్దన్న, ఎస్ఐలు అమర్‌నాథరెడ్డి, ప్రదీప్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కాగా, చోరీల నియంత్రణకు ప్రజలు స్వచ్ఛం దంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.



బైకులను పరిశీలిస్తున్న ఎస్పీ

అకడమిక్ కన్సల్టెంట్ల భాగస్వామ్యం అవసరం

- వైవీయూ వీసీ రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ అభివృద్ధిలో అకాడమిక్ కన్సల్టెంట్ల భాగస్వామ్యం అవసరమని వైస్ చాన్సలర్ రాజశేఖర్ తెలిపారు. జాతీయస్థాయి ర్యాంకులు పొందడంలో అకడమిక్ కన్సల్టెంట్ల పాత్ర కూడా కీలకమని చెప్పారు. మంగళవారం వైవీయూలో అకడమిక్ కన్సల్టెంట్లతో సమావేశమై మాట్లాడుతూ ప్రతి అకడమిక్ కన్సల్టెంట్ మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టుల్లో విజ్ఞానాన్ని పొందాలని, బలమైన బయోడేటాను రూపొందించుకోవాలన్నారు. సబ్జెక్టుల్లో విస్తృత జ్ఞానాన్ని పొందడమే కాకుండా, పరిశోధనా పత్రాలను ఎక్కువగా రాయాలని, విశ్వవిద్యాలయం పేరుతో వాటిని ప్రచురించాలన్నారు. బోధనా నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. 110 జీఓను అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎన్పీటీఈఎల్ స్వయంవంటి టీచింగ్ ప్లాట్‌పామ్‌ల ద్వారా నిరంతరం కోర్సులు చదువుతూ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నా రు. బోధనపరిశోధన సామర్థ్యాలు మెండుగా ఉన్నప్పుడు అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. విశ్వవిద్యాలయం అప్పజెప్పిన బాధ్యతలను జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ కూడా పలు సూచనలు చేశారు. అకడమిక్ కన్సల్టెంట్ హరినాథ్‌రెడ్డి, వీరప్ప, వెంకటేష్, రమణ, దామోదర్,మానస పలు సమస్యలను ఉపకులపతి దృష్టికి తెచ్చారు. సమావేశంలో అకడమిక్‌కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

స్కాలర్లు యూజీసీ నెట్ అర్హత సాధించాలి

విశ్వవిద్యాలయంలోని ప్రతి స్కాలర్ యూనివర్సిటీ గ్రాంట్‌కమీషన్ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) అర్హత సాధించాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం యోగి వేమన విశ్వవిద్యాలయంప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్ సహకారంతో జరుగుతున్న యూ జీసీ, సీఎస్ఐఆర్‌నెట్ శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. బోధన వైఖరులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధి స్తే లెక్చరర్ షిప్‌నకు అర్హత లభిస్తుందన్నారు. నిత్యం సాధన చేయాలని సూచించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి, స్కాలర్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం



కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రంథాలయ సిబ్బంది

కడప మారుతీనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ దశలో ఊగిసలాడుతున్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం కడపకు విచ్చేసిన కోటేశ్వరరావు కడపలో నిర్మాణ దశలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం నిర్మాణానికి వీలుగా ప్రభుత్వం తరపున కోటి రూపాయలు మంజూరు చేసిందన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు జరిగేలా చూడాలని ఆదేశాలిచ్చారు. అంతకుముందు నగర కొండాయపల్లెలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు కావలసిన తెలుగు అకాడమీ పుస్తకాలను, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కావలసిన కాంపిటేషన్ పుస్తకాలను అందుబాటులో వుంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.రామకోటిరెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ రాజకుమార్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు కానిస్టేబుల్ ఎంపిక



కానిస్టేబుల్ మహబూబ్‌బాషను అభినందిస్తున్న డీఎస్పీ

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరగనున్న తైక్వాండో హూమ్సే పోటీలకు ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్పీ మహబూబ్‌బాష ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం డీఎస్పీ భావన తన కార్యాలయంలో కానిస్టేబుల్ మహబూబ్‌బాషను అభినందించారు. నవంబరులో కాకినాడలో జరిగిన 14వ రాష్ట్రస్థాయి తైక్వాండో హూమ్సే పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించారు. దీంతో జాతీయస్థాయి పోటీలకు మహబూబ్‌బాష ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాదులోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొనను న్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ భావన మాట్లాడుతూ జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభను కనపరిచి పతకాన్ని సాధించాలని అభిలషించారు. మహబూబ్‌బాష ఎంపికపట్ల ట్రాఫిక్ సీఐ రాజగోపాల్, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

దేశాభివృద్ధిపై మాత్రమే చట్టసభల్లో చర్చ జరగాలి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో దేశం అభివృద్ధి చెందే విధంగా రాజ్యాంగాన్ని అనుసరించి చర్చలు జరగాలే తప్ప అనవసర విషయాలు, మతోన్మాద ఉద్రిక్తతలను రెచ్చగొట్టే విధంగా చర్చ ఉండకూడదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథరెడ్డి హితవు పలికారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు దూసుకుపోతోందని ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యతో దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైందని, దానిపై చర్చను కోరుతుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరం లేని వాటిపై చర్చించాలని ఆర్డర్ వేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎన్నికల ముందు బీహార్ రాష్ట్రంలో 60లక్షల మంది ఓటర్లను తొలగించే విషయంలో పెద్దకుట్ర జరిగిందన్నారు. ఒకపక్క రూపాయి విలువ పతనమవుతుంటే దాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ సమర్థించడం ఎంత మాత్రం సబబన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రూ.కోట్లల్లో అప్పులు చేస్తోందని, ఇవన్నీఎక్కడ ఖర్చు చేస్తున్నది ప్రజలకు తెలపాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందలేదని, దీనిపై రాష్ట్రంలోని జిల్లాల మార్కెట్ యార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎన్.వెంకటశివ, గుంటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సిగటోక తెగులు నివారణకు చర్యలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రవీంద్ర

వేంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లెతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో అరటి పంటకు సిగటోక ఆకు మచ్చ తెగులు సోకడంతో శాస్త్రవేత్తలు పరిశీలించి, రైతులకు నివారణ చర్యలు సూచించారు. మొదట పంటలను పరిశీలించిన కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర, ఏడీఏ రవిచంద్రలు రైతులతో సమావేశం నిర్వహించారు. అరటిలో ఎరువులు, మొక్కలు నాటిన ఇరవై రోజుల నుంచి వేయాలన్నారు. ఏడునెలల వరకు అరటికి వేయాల్సిన ఎరువులు, మిశ్రమాల గురించి వివరించారు. ప్రధానంగా సిగటోక ఆకుమచ్చ తెగులు నివారణకు క్లోరోతలోనిల్ లీటర్‌కు రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. మచ్చలు కనిపించిన ఆకులపై ప్రొపికొనాజోల్ మినరల్ ఆయిల్ తగిన మోతాదులో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా పూర్తిస్థాయిలో అధికారుల సూచన మేరకు మందులు వాడాలని తెలిపారు. అరటి గెలలకు మొగ్గ ఇంజక్షన్లు, తొడుగులు వేసుకున్నట్లయితే రూ.25,500 ఇస్తారని, తద్వారా కాయ నాణ్యత లభిస్తుందని తెలిపారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల భవిత కేంద్రం, జిల్లా సత్వర చికిత్స కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం కడప రిమ్స్ ఆవరణలోని జిల్లా బాలల భవిత కేంద్రం, జిల్లా సత్వర చికిత్స కేంద్రాలను జడ్జి విజిట్ చేసి న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాలు లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగదల లోపాలకు సంబంధించిన తల్లిదండ్రులు ఇలాంటి చికిత్స సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రత్యేక పిల్లులు కూడా ఉన్నత స్థానాలను అదిరోహిస్తున్నారన్నారు. వీరి కోసం జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024 ప్రవేశపెట్టిందన్నారు. వికలాంగుల హక్కుల చట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ 1098, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ యాదవ్, బాలల భవిత కేంద్రం డాక్టర్లు, పారాలీగల్ వాలంటీర్లు, తల్లిదండ్రులు, ప్రత్యేక పిల్లలు పాల్గొన్నారు.



మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

● పులివెందుల పోలీసు సబ్ డివిజన్ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



పులివెందుల సబ్ డివిజను పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

కడప క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పులివెందుల సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ ఉక్కుపాదం మోపాలన్నారు. బాలికలు, మహిళల వేధింపులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలు, పల్లెనిద్ర, గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికకు వచ్చే ఫిర్యాదుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలు తీర్చాలన్నారు. శక్తిటీం పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. సమావేశంలో పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, సబ్ డివిజనులోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

కమలాపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ అభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీలో ఛైర్‌పర్సన్ మార్పురి మేరీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది చేపట్టిన అభివృద్ధి పనులను కౌన్సిల్ సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురం మోడల్ నగర పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి త్వరలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా చేపడతామన్నారు. ఎక్కడైనా సీసీరోడ్లు అవసరమైతే తన దృష్టికి తీసుకువస్తే వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు.

దివ్యాంగులకు మహర్దశ

కడప మారుతీనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వ పాలనలో దివ్యాంగులకు మహర్దశ కలిగిందని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. వికలాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల కార్పొరేషన్ ఛైర్మన్ జి.నారాయణస్వామి, గ్రంథాలయ ఛైర్మన్ జి. కోటేశ్వరరావు, వీహెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మొక్కలకు 20 రోజుల నుంచి ఎరువులు వాడాలి

పులివెందుల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అరటి మొక్కలు నాటిన 20 రోజుల నుంచి ఎరువుల వాడడం ప్రారంభించాలని కొవ్వూరు అరటి పరిశోధన స్థానం సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రకుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని కనంపల్లె గ్రామంలో అరటి రైతులకు సిగటోక, ఆకుమచ్చ తెగులు నివారణ, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, గెలల యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు నెలల వరకు 80శాతం వాడాలని, మిగతా 20శాతం ఎరువులు గెల వేసిన తర్వాత వేసుకోవాలన్నారు. రోజుకు ఒక మొక్కకు పది లీటర్ల నీరు, పెరుగుదల దశలో 15-20లీటర్లు నీరు, గెల వేసిన తర్వాత వేసవి కాలంలో చెట్టుకు 25-30 లీటర్లు నీరు అవసరం అవుతుందన్నారు. గెలకు తొడుగులు వేసుకోవాలన్నారు. అలాగే సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాపించిన తోటల్లో ఉపయోగించాల్సిన మందులను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు రవిచంద్రబాబు, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోతున్న రైతులు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నారని ఏపీరైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. మంగళవారం కడప రూరల్ ప్రాంతమైన చిన్నమాచుపల్లె గ్రామాల్లో ఏపీ రైతు సంఘం ప్రతినిధి బృందం పర్యటించి కల్లాల్లో ఉన్న వరి ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ వల్ల ధాన్యం దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తగ్గిన దిగుబడి మేరకు పంటల బీమా పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం పుట్టి (ఎనిమిది బస్తాల) వడ్లు రూ.14వేలు ఉంటే, బహిరంగ మార్కెట్‌లో రూ.12వేలకే రైతులు అమ్ముకుంటున్నారని, మద్దతు ధర కోల్పోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కండీషన్ లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలి

● టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేశ్

కడప మారుతీనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సామర్థ్యానికి మించి రాకపోకలు జరుపుతున్న కండీషన్‌లో లేని విద్యాసంస్థల వాహనాలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన జిల్లా ఉపరవాణా కమిషనరు కార్యాలయంలో ఏవో దేవమ్మకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కొంతమంది రవాణా చట్టాలను తుంగలో తొక్కి నిబంధనలు పాటించకుండా కండీషను లేని వ్యాన్లతో రాకపోకలు జరుపుతున్నారన్నారు. 40 నుండి 45 మందికి సామర్థ్యం గల వ్యాన్‌లో దాదాపు 80 నుండి వంద మంది వరకు విద్యార్థులను ఎక్కించుకుంటున్నారన్నారు. వెంటనే ఆయా స్కూలు బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేశ్, సుదీప్, శివసాయి పాల్గొన్నారు.

వైభవంగా రాహుకాల పూజలు



రాహుకాల పూజల్లో పాల్గొన్న మహిళలు

కడప కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామునే అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గ్రహాలు విజయదుర్గాదేవి అమ్మవారి ఆధీనంలో ఉంటాయి కాబట్టి అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు చేస్తే అమ్మఅనుగ్రహం లభిస్తుందని పండితులు తెలిపారు. అలాగే ఈనెల 14న ఆదివారం విజయదుర్గాదేవి సమేత మల్లికార్జునస్వామి శాంతికల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ తెలిపారు.

'అండగా ఉంటాం'

కమలాపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

సస్యరక్షణ చేపట్టాలి

లింగాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగుచేసిన శనగ పంటలో వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రమేశ్ తెలిపారు. మండలంలోని పెద్దకుడాల గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శనగలో పురుగుఉధృతి, వేరుకుళ్లు తెగులు ఉందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

నాణ్యత పాటించాలి

లింగాల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): లింగాల కుడికాల్వ 31వ కిలోమీటర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పార్నపల్లె టీడీపీనాయకుడు ధనుజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దూరంగా ఉండాలి

పులివెందుల టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోవాలని ఏఎస్ఐ వర్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని లయోలా డిగ్రీకళాశాలలో కళాజాతృతి బృందం ఇన్‌చార్జి జి.నరసరామ్ ఆధ్వర్యంలో యువతా.. మేలుకో నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ వర్మ మాట్లాడుతూ మెరుగైన సమాజం కోసం బాధ్యత గల వ్యక్తిగా మత్తుపదార్థాల ఆచూకీ తెలపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వనచిన్నప్ప, నార్కోటిక్స్ ఏఎస్ఐ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

పెండ్లిమర్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసేటప్పుడు రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని ఏడీఏ లక్ష్మీమాధవి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చౌటపల్లె పొలాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో సుమంత్‌రెడ్డి, ఏఈవో గంగాధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వనరులను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులను మెరుగుపరచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం సమాఖ్య సభ్యులకు విజన్-1 కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్థానిక వనరులను ఉపయోగించుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరమణరాజు, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

పోలీసులు సహకరించాలి

కడప రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఈనెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి పోలీసులు సహకరించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాసదన్‌లో పోలీసు అధికారులతో ముందస్తు లోక్ అదాలత్‌ను నిర్వహించారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.





మైదుకూరులో వాలీబాల్ పోటీలు

మైదుకూరు డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ, మైభారత్ అమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి మైదుకూరు నియోజకవర్గ స్థాయిలో స్థానిక మేదా డిఫెన్స్ అకాడమి క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు మైభారత్ కడప శాఖ అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ పోటీలలో 16 నుంచి 28 సంవత్సరాల వయస్సు గల యువకులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉన్న జట్లను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న వారికి సర్టిఫికేట్లు అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 8520001065కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

పంట నమోదు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి బాల గంగాధర్‌రెడ్డి

మైదుకూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) :మండలంలోని రైతులందరూ రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను గ్రామం పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బాల గంగాధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వరదాయపల్లె, కొత్తపల్లె గ్రామాలలో రబీలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు ఎవ్వరు అర్హులు అనే విషయాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో సెరీకల్చర్ అధికారి గురప్ప, రైతులు పాల్గొన్నారు.

కంది పంటలో పచ్చదోమ

కాశినాయన డిసెంబరు9(ఆంధ్రజ్యోతి) కంది పటంలో పేనుబంక, పచ్చదోమ అధికంగా ఉందని మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం గంగనపల్లె గ్రామంలో ఏఈవో రవి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సాగులోఉన్న కందిని పరిశీలించారు.

విత్తన శుద్ధి అవసరం

కలసపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసే రైతులందరూ విత్తనశుద్ధి తప్పక పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మహానందిపల్లె, మావిళ్లపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పైరుకు యూరియా వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సుబ్రమణ్యం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన

కలసపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫామ్ సాగుపై మంగళవారం మహానందిపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. జాతీయ ఆయిల్‌ఫామ్ పరిశోధన స్థానం ఏలూరు జిల్లా వేదగిరి నుంచి వచ్చిన శాస్త్రవేత్త తిరుపతిరెడ్డి, స్థానిక ఉద్యాన అధికారి శ్రీనివాసరెడ్డితో కలిసి పంట సాగు, ఖర్చు, లాభాలు, ప్రభుత్వ ప్రోత్సాహంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో బద్వేల్ ఉద్యాన అధికారి భరత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలు ఇలా.. పోటీలు ఎలా..?



వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారిన జమ్మలమడుగు పీఆర్ పాఠశాల మైదానం

జమ్మలమడుగు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగులోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు దారుణంగా మారాయి. దీంతో విద్యార్థులను క్రీడాకారులుగా ఎలా తీర్చిదిద్దుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రైవేటు పాఠశాలల్లో మైదానాల్లేక విద్యార్థులు ఎంతసేపు చదువులతోనే కుస్తీ పడుతున్నారు. దీనివల్ల మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయని మానసిక వైద్యులు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు మైదానాలు ఉన్నా వాటి నిర్వహణ సరిగాలేక విద్యార్థులు క్రీడాపోటీలపై ఆసక్తి పెంచుకోలేకపోతున్నారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల్లోని పలు గ్రామాల్లో క్రీడామైదానాలు విద్యార్థులు క్రీడలకు దూరం చేశాయి. వర్షాల కారణంగా మైదానాలన్నీ నీటిగుంతలు, ముళ్లపొదలు, గడ్డి మొలచి నిరుపయోగంగా మారాయి. అందులో బాగంగా జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలుర జూనియర్ కళాశాల కలిపి ఒకే మైదానం గుంతలు, గడ్డి తదితర వ్యర్థాలతో నిండి విద్యార్థులు మైదానంలోకి వెళ్లడానికి వీలులేకుండా పోయింది. అలాగే బాలికల జూనియర్ కళాశాలలో ఇదే సమస్య ఉంది. ప్రొద్దుటూరు రోడ్డులోని మార్కెట్ హైస్కూలు ఆవరణం, మోరగుడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం, మైలవరంలోని దొమ్మరనంద్యాల ఉన్నత పాఠశాల మైదానం పూర్తిగా క్రీడలకు నిరుపయోగంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆయా మండలాల విద్యాశాఖాధికారులతోపాటు సంబందిత పాఠశాలల హెడ్మాస్టర్లు చొరవతీసుకుని ఆయా పాఠశాలల్లో మైదానాలు విద్యార్థుల క్రీడాపోటీలకు ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

ప్రొద్దుటూరు , డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయిందని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీజే రాయలసీమ ఇన్‌చార్జ్ ఎండి అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషనులో ఎస్‌ఐ భాస్కర్‌కు ఎంపీజే నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ పట్టణంలో సుధా థియేటర్, అన్వర్ హాలు పాత బస్టాండ్ రాజీవ్ సర్కిల్ కొత్తబస్టాండ్ వద్ద ట్రాఫిక్ అధి కంగా ఉంటోందన్నారు. త్రీటౌన్ సర్కిల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో రోడ్లమీద వ్యాపారాలు చేసే వారికి ప్రత్యేక జోన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీజే పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ముక్తియార్, ఫరాన్ పాల్గొన్నారు.

గోపవరం విద్యార్థిని ప్రతిభ

గోపవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ గోపవరం హైస్కూలుకు చెందిన వెంకట రాజనందిని వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయిలో మొదటి స్థానం సొంతం చేసుకుంది. అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచి మొదటి స్థానాన్ని దక్కించుకుంది గోపవరం హైస్కూలులో 9వ తరగతి చదువుతున్న వెంకట రాజనందిని ఎస్పీ చేతుల మీదుగా నగదు బహుమతిని, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారని పాఠశాల హెచ్‌ఎం తెలిపారు.

ఎస్‌ఐకి ఘన సన్మానం

బి.కోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండల ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారయాణరెడ్డిని మంగళవారం టీడీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, శేషారెడ్డి, గోడి రమణారెడ్డిల ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. వారితో పాటు మేకవారిపల్లె నీటి సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, దుగ్గిరెడ్డి, రాఘవరెడ్డి, పవన్, నరసింహులు, నరసయ్య, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ మహాసభలను జయప్రదం చేయండి

కలసపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం 79వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ నెల 13, 14 తేదీల్లో కడప జిల్లా పరిషత్ సమావేశమందిరం ఈ మహాసభలను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. కలసపాడులోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ మస్తాన్‌వలితో పాటు ఉపాధ్యాయులకు ఆహ్వానపత్రికలు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

సీఆర్‌ఎంటీల సమస్యలు పరిష్కరించండి

కాశినాయన డిశంబరు9 (ఆంధ్రజ్యోతి) క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్‌ల(సీఆర్‌ఎంటీ) సమస్యలు పరిష్కరించాలని మండల సీఆర్‌ఎంటీలు మంగళవారం ఎస్‌టీయూ నాయకుడు సుబ్రమణ్యం, యూటీఎఫ్ నాయకులు భాస్కర్‌రెడ్డి, జోజయ్యలకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా తాము సీఆర్‌ఎంటీలుగా పనిచేస్తున్నా పెరిగిన ఖర్చులకు తగ్గట్టు ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం ధారుణమన్నారు. సీఆర్‌ఎంటీలను విద్యాశాఖలో విలీనం చేయాలని,కారుణ్య నియామకాలు వర్తింపజేయాలని,ఇతర ఉద్యోగులతోపాటు అలవెన్సులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేవారు.ఈకార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు రాజు,రవి పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం

కలసపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారం ఎతో అవసరమని వైద్యాధికారి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో 27 మంది గర్భవతులకు హిమోగ్లోబిన్, షుగర్, బీపీ, హెచ్‌ఐవి, తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అసాధారణ గర్భవతులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయితే ప్రధానమంత్రి మాతృవందన యోజన కింద మొదటి కాన్పునకు రూ.5వేలు, రెండో కాన్పునకు ఆడపిల్లపుడితే రూ.6వేలు, ఇవ్వనున్నట్లు తెలిపారు

బస్సులను ఆపాలంటూ విద్యార్థుల ఆందోళన



రోడ్డుపై అడ్డుగా నిలబడి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఖాజీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బస్సులను ఆపాలంటూ ఖాజీపేట మండల విద్యార్థులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. కుమ్మరికొట్టాలు వద్ద రోజు వంద మంది విద్యార్థులు పలు బస్సుల్లో స్కూళ్లకు, కాలేజీలకు వెళుతుంటారు. అయితే అద్దె బస్సుల డ్రైవర్లు బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని మంగళవారం చేసేదేమి లేక విద్యార్థులు రోడ్డుకు అడ్డంగా నిలబడి నిరసన తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకుంటే తమ పిల్లలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండల సమావేశంలో ఫిర్యాదు చేసినా ఫలితంలేదు

ఖాజీపేట మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు బస్సుల విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. మండల సమావేశానికి అధికారులు రాకుండా సిబ్బందిని పంపడం వలన వారు హామీ ఇవ్వలేక అధికారులకు తెలుపుతామంటూ వెళ్లిపోతున్నారని వారంటున్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి



జీవాలకు నట్టల నివారణ మందును తాగిస్తున్న పశువైద్యాధికారులు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డప డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ రాజ తిమ్మారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బంకచిన్నాయపల్లె గ్రామంలో మంగళవారం శాస్త్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా కడప డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ రాజతిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో గేదెలలో గర్భకోశవ్యాధులకు చికిత్స, దూడలకు నట్టల నివారణమందులు, సాధారణ చికిత్స, జీవాల్లో గొంతువాపు వ్యాధికి టీకాలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఆర్.ధనుంజయరెడ్డి, తాళ్లమాపురం పశువైద్య అధికారి డాక్టర్ మాధవ ఓబుళరెడ్డి, పశువైద్యశాల సిబ్బంది, జీవాల సంరక్షకులు, రైతులు పాల్గొన్నారు.

బద్వేలుకు తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అట్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఆటోలో బద్వేలుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని వాహనాల తనిఖీలో భాగంగా స్వాధీనం చేసుకున్నట్లు అట్లూరు ఎస్‌ఐ నాగకీర్తన తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఇళ్ల వద్ద సేకరించిన 500 కేజీల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ఆటోతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. కాగా ఆ రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు బద్వేలు ఎంఎల్‌ఎస్ పాయింటుకు పంపడం జరిగిందని డిప్యూటీ తహసీల్దారు శిరీష, ఆర్‌ఐ రమణ తెలిపారు.

వెలుగు సీసీ మృతి.. అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పోరుమామిళ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మండలంలో సీసీగా పనిచేస్తున్న శివరామక్రిష్ణయ్య(48) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి శివరామక్రిష్ణయ్య సతీమణి గురుదేవికి దహన సంస్కారాల నిమిత్తం రూ.25వేల నగదు అందించారు. అలాగే వెలుగు సిబ్బంది ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం ధనుంజయ, ఏపీయం వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు విజన్-1పై శిక్షణ

చాపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని వెలుగు కార్యాలయంలో మంగళవారం విజన్-1పై అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్లు సుబ్బరత్న, నాగన్న, జీవన్, వెంకటరమణ వారికి శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ నిధులతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మరో మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అవినీతితో అభివృద్ధికి విఘాతం



బహుమతులతో విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవినీతి వలన అభివృద్ధికి విగాతం కలుగుతుందని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రామేశ్వరం మున్సిపల్ హైస్కూలులో వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడాలి

మైదుకూరు డిసెంబరు09(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఉద్యోగులంతా సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పోరాడాలని మంగళవారం మైదుకూరులో జరిగిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జనరల్ బాడీ సమావేశంలో పిలుపునిచ్చారు. ఏపీజీడబ్ల్యుఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యూనియన్ బలోపేతం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సెక్రటరీలు నరసింహప్రతాప్, వీరాంజనేయులు, వైస్‌ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రసవత్తరంగా మారిన ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక



మండల పరిషత్ కార్యాలయం

ముద్దనూరు డిసెంబర్9(ఆంధ్రజ్యోతి): ముద్దనూరు ఎంపీపీ ఎన్నిక రసవత్తరంగా మారిది. గత వైసీపీ ప్రభుత్వంలో 10ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండు వినహా అన్ని స్థానాలను వైసీపీ కైవసం చేసుకోవడంతో ఎంపీపీ స్థానాన్ని ఆ పార్టీనే దక్కించుకుంది. అయితే మండలాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కుడుముల ప్రదీప్‌కుమార్‌రెడ్డి మండల అభివృద్ధి కోసం నిర్వహించే అత్యంత ప్రాధాన్యత ఉన్న మండల సర్వసభ్య సమావేశాలకు డుమ్మా కొట్టడంతో ఎంపీపీ పై అనర్హత వేటు పడింది. దీంతో ఈనెల 11వ తేదీ గురువారం ముద్దనూరు మండలాధ్యక్షుడి ఎన్నికల జరుగనుంది. గతంలో 10 మంది ఎంపీటీసీలకు గాను వైసీపీ 8స్థానాలు , బీజేపీ 2 స్థానాలు దక్కించుకోగా ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి అనర్హత వేటు పడగా మిగిలిన 9మంది ఎంపీటీసీలు ఎంపీపీని ఎనుకోనున్నారు. వారిలో 6మంది వైసీపీ ఎంపీటీసీలు, ముగ్గురు బీజేపీ ఎంపీటీసీలు ఉన్నారు. కాగా బీజేపీ ఎంపీటీసీలు ముగ్గురికి చేరడంతో ఇక ఇద్దరు ఎంపీటీసీలు ఆ పార్టీ వైపు వస్తే ఎపీపీ వారికే దక్కుతుంది. దీంతో ఈ ఎన్నిక రసవత్తరంగా మారిందని సర్వత్రా చర్చసాగుతోంది.

ఎంపీటీసీల తరలింపు..!

ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ ఎంపీటీసీలను బీజేపీ ఎక్కడ వారి వైపునకు తిప్పుకుంటుందనే ఆందోళన నేపథ్యంలో వైసీపీ నేతలు బెంగుళూరుకు తరలించినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా బీజేపీకి ఎంపీపీని కైవసం చేసుకోవాలంటే ఇద్దరు ఎంపీటీసీలు అవసరం. అయితే బీజేపీ నాయకులకు ఇద్దరు ఎంపీటీసీ టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐవో ఉమామహేశ్వర కుమార్

జమ్మలమడుగు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఐవో ఉమామహేశ్వరకుమార్ పేర్కొన్నారు. జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో మంగళవారం ఈనెల 21వ తేదీ నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంపై సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఐవో మాట్లాడుతూ 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేసి, వేయించి వారికి అంగవైకల్యం రాకుండా చూడాలన్నారు. ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఆర్టీసీ బస్టాండు, గ్రామాలకు శివార్లలో ఉండే ప్రాంతాల్లో పల్స్‌పోలియో కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత మాట్లాడుతూ చిన్నారుల తల్లిదండ్రులు పోలియో కేంద్రానికి వారి వారి పిల్లలను తీసుకొచ్చి పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ ప్రత్యేక కృషి



శంకరాపురంలో శ్మశాన వాటిక స్థలానికి హద్దులు పరిశీలిస్తున్న తహసీల్దారు

ప్రొద్దుటూరు , డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో పలుగ్రామాల్లో ఉన్న సమస్యలను తహసీల్దారు గంగయ్య రెవెన్యూ సిబ్బంది తో కలిసి క్షేత్ర స్థాయికి వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఆమేరకు మంగళవారం తహసీల్దారు గంగయ్య మండల సర్వేయర్ వెంకటలక్ష్మీ, ఆర్‌ఐ నాగమోహన్, విలేజ్ సర్వేయర్లు వీఆర్‌వోలతో కలిసి పెద్దశెట్టి పల్లె పంచాయతీలోని శంకరాపురం గ్రామంలో శ్మశాన స్థలం ఆక్రమణకు గురికావడంతో సర్వేచేపట్టి 8 ఎకరాలకు హద్దులు ఖరారు చేశారు. గతంలో ఉన్న హద్దులను కొందరు ఆక్రమణదారులు తొలగించడంతో తిరిగి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. అలాగే పెద్దశెట్టి పల్లె పంచాయతీ నరసింహాపురం ఎస్సీ కాలనీకి రహదారి సమస్యపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి పరిష్కరించారు. సర్వేప్రకారం రెవెన్యూ అధికారులు ఖరారు చేసిన దాన్ని ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధిస్తాం

రాజుపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ ఆదేశాల మేరకు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం కొర్రపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను ఎంఈవో తనిఖీ చేశారు. అక్కడి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం విద్యార్థులు స్టడీ అవర్‌లో పాల్గొనాలన్నారు. ప్రతి విద్యార్థి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా విద్యార్థులు సిద్ధం కావాలని సూచించారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడండి



పన్ను వసూళ్ల ప్రక్రియ గురించి మాట్లాడుతున్న కమిషనర్

బద్వేలు, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సకాలంలో సక్రమంగా పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పలు ప్రాంతాలలో పన్ను వసూళ్లపై ఆరా తీశారు. ముఖ్యంగా 100మంది మొండి బకాయిదారుల జాబితాను బహిరంగ ప్రదేశాలు, కూడళ్లలో ఉంచ దంజరుగుతుందని హెచ్చరించారు. సంబంధిత బకాయిదారులు అందుబాటులోలేకపోతే వారి ఇళ్లు, షాపులలో అద్దెకు ఉన్నవారికి నోటీసులు అందించడం జరుగుతుందన్నారు. ఏళ్ల తరబడి బకాయిలున్నవారు పన్ను ఎగవేతలకు పాల్పడడం సరికాదని, తక్షణమే చెల్లించ కుంటే వారి వ్యాపార సముదాయాలను సీజ్ చేయడం జరుగుందన్నారు. మొదట వారెంట్లు అందజేసి అనంతరం జప్తు ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందన్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనంతా అక్రమాల పర్వమే..

●టీడీపీ నేతల ధ్వజం



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్

ప్రొద్దుటూరు , డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనంతా అక్రమాల పర్వమేనని టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ వాల్మీకి బోయ కార్పొరేష్ డైరెక్టర్ నాగరాజు, కౌన్సిలర్ మురళీధర్ రెడ్డిలు ఆరోపించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన మున్సిపల్ పెట్రోల్ బంకును వారి కను సన్నుల్లో నిర్వహించారని దీంతో నేడు జమా ఖర్చులు లెక్క తేలకపోవడమేనని ఆరోపించారు. శివాలయంకు చెందిన అద్దెగదుల్లో గత వైసీపీ పాలనలో చైర్మన్లుగా పనిచేసిన వారు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని దేవుని సొమ్ముకూడా దోచుకు తిన్న దుర్మార్గులన్నారు. వారి అక్రమాలు వెలుగులోకి తీసుకొచ్చి ప్రజల్లో బహిర్గతం చేస్తుంటే జీర్ణించుకోలేక వైసీపీ నేతలు రాచమల్లు, బంగారు రెడ్డిలు ఎమ్మెల్యే వరదరా జులరెడ్డి ఆయన కుమారుడు కొండారెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పిల్లలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు శిక్షణ

మైదుకూరు డిసెంబరు09(ఆంధ్రజ్యోతి):పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టడానికి మంగళవారం మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాదికారి(డీడీఎంహెచ్ఒ) డాక్టర్ మల్లేష్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు అఘాయిత్యాలకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, అఘాయిత్యాలకు గురైన బాదిత పిల్లలకు ఏవిధంగా అండగా నిలవాలి వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు సుధా,శ్రీకాంత్, సుమదుర, అయేషా, సూపర్వైజర్లు వెంకటేశ్వర్లు, వీరయ్యలు పిల్లలపై లైంగిక వేధింపులు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.